సాక్షి ప్రకాశం

శుక్రవారం | 23 | జూన్ | 2023



త్రుటిలో తప్పిన ప్రాణగండం

హైవేపై ప్రయాణిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అర్ధరాత్రి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ప్రయాణికులకు త్రుటిలో ప్రాణగండం తప్పింది. - IIలో..



పద్ధతి మారకపోతే కఠిన చర్యలు

రౌడీషీటర్లు వారి పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మలికా గర్గ్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
34 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రేపు స్టెనోగ్రాఫర్లకు అర్హత పరీక్ష

ఒంగోలు: జిల్లా న్యాయస్థానం పరిధిలోని పర్మినెంట్ లోక్ అదాలత్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో స్టెనోగ్రాఫర్ల నియామకానికి ఈ నెల 24వ తేదీ అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.భారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించే పరీక్షకు అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఈ పరీక్షను జూలై 1వ తేదీ నిర్వహించాలని ముందుగా నిర్ణయించినప్పటికీ.. ఈ నెల 24వ తేదీకి మార్చారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా ఈ నియామకాలు జరుగుతాయని, అభ్యర్థులు వారి టైప్ రైటర్ వారే తెచ్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

డీడీఆర్‌సీ సంస్థాపనకు ప్రతిపాదనల ఆహ్వానం

ఒంగోలు: ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా దివ్యాంగుల రీహాబిలిటేషన్ సెంటర్ (డీడీఆర్‌సీ) సంస్థాపనకు ఆసక్తి కలిగిన వారి నుంచి ప్రతిపాదనలు కోరుతున్నట్లు విభిన్న ప్రతిభావంతులశాఖ సహాయ సంచాలకురాలు జి.అర్చన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీలోగా ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాలకు లోబడి ఒంగోలు నగరంలోని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో గల విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ వారికి నిర్ణీత తేదీలోగా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 08592–281310 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ప్రాథమికంగా ఎంపికైన 80 మంది విద్యార్థుల జాబితాను ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ టి.జయశ్రీ వెల్లడించారు. సంబంధిత విద్యార్థులు హాల్‌టికెట్ తీసుకుని జూలై 5వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఒంగోలు జవహర్ నవోదయ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

98 డీఎస్సీ ఉపాధ్యాయులకు నేడు పాఠశాలల కేటాయింపు

ఒంగోలు: డీఎస్సీ 1998 మినిమం టైమ్ స్కేలు కింద నియమితులైన ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాలలు కేటాయించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డీఆర్ఆర్‌ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. సదరు ఉపాధ్యాయులు 2023–24 సంవత్సరానికి వారి కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌ను సంబంధిత ఎంఈవోలకు అందజేయాలన్నారు. పైన తెలిపిన జాబితాలోని కాంట్రాక్ట్ ఉపాధ్యాయులందరూ విధిగా కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

జిల్లా వైద్యశాలను పరిశీలించిన ముస్కాన్ టీం



వైద్యశాలను పరిశీలిస్తున్న ముస్కాన్ టీం సభ్యులతో సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి

మార్కాపురం టౌన్: స్థానిక జిల్లా వైద్యశాలను సూపరింటెండెంట్ సుబ్బారెడ్డితో కలిసి ముస్కాన్ టీం సభ్యులు గురువారం పరిశీలించారు. వైద్యశాలలో ఐపీ, ఓపీ, ఎస్ఎన్‌సీయూ విభాగాలలో పిల్లలకు అందుతున్న వైద్యం గురించి బృంద సభ్యులైన డాక్టర్ అరవింద్, ప్రదీప్ శ్రీవాస్తవలు అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లల విభాగాలకు చెందిన వార్డులలో తిరిగి అక్కడ అందుతున్న వైద్య సహాయం గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వైద్యశాల ర్యాంకింగ్ కేటాయింపులో భాగంగా జిల్లా వైద్యశాలను ముస్కాన్ టీం సభ్యులు పరిశీలించారన్నారు. 80–85 శాతం బాగున్నట్లు తెలిపారన్నారు. త్వరలో ర్యాంక్‌లు ప్రకటిస్తారని చెప్పారు. ఐపీ విభాగం వైద్యులు డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి, చిన్నపిల్లల ఓపీ విభాగం వైద్యులు ఎస్.అశోక్‌రెడ్డి, ఎస్ఎన్‌సీయూ వైద్యులు దస్తగిరి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని పెంచి ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తాజా..తాజాగా అన్ని రకాల మత్స్య ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతన్నలకు అండగా నిలుస్తోంది. నిరుద్యోగ యువత, మహిళలకు సైతం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది. జిల్లా వ్యాప్తంగా 86 కొత్త యూనిట్లు ఏర్పాటు చేసింది.

- నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు అందుబాటులోకి
- ఫిష్ ఆంధ్రా అవుట్ లెట్స్‌కు స్పందన
- రైతులు, యువతకు భరోసాగా ఏర్పాటు
- జిల్లాలో అందుబాటులోకి 86 యూనిట్లు
- మహిళలకు సైతం పథకం అమలు

ముంగిటకు.. తాజా..తాజాగా..!

సింగరాయకొండ: చేపలు, రొయ్యలు, పీతలు వంటి మత్స్య సంపదను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సముద్రంలో లభ్యమయ్యే మత్స్య ఉత్పత్తులతో పాటు సాధారణంగా మంచినీటిలో లభ్యమయ్యే మత్స్య సంపదను కూడా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రిటైల్ అవుట్ లెట్స్‌కు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ప్రతి యూనిట్‌కు సబ్సిడీ ఇచ్చి మరీ ప్రోత్సహిస్తోంది. బ్యాంకు రుణ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ప్రధానంగా ఈ రంగంలోని వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

అపార మత్స్య సంపద...

జిల్లాలో తీర ప్రాంత మండలాలు నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ ఉన్నాయి. తీర ప్రాంతం 52 కిలో మీటర్ల మేర ఉంది. మత్స్యకార గ్రామాలు 35 ఉన్నాయి. తీరప్రాంతం ఎక్కువగా ఉండటంతో అపారమైన మత్స్య సంపద అందుబాటులో ఉంది. అలాగే జిల్లాలో 15 వేల ఎకరాలకుపైగా ఆక్వా సాగులో ఉంది. ఉప్పునీరు, మంచినీటిలో రొయ్యల పెంపకం కూడా సాగుతోంది. అదేవిధంగా జిల్లాలోని సాగునీటి చెరువుల్లో కూడా చేపలు, రొయ్యల పెంపకాన్ని చేపడుతున్నారు. ఇబ్బడి ముబ్బడిగా మత్స్య సంపద, మత్స్య ఉత్పత్తులు అందుబాటులో ఉండటంతో జిల్లా నుంచి చేపలను ఇతర రాష్ట్రాలకు, రొయ్యలు, పీతలను ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. ఏదైనా కారణాలతో ఎగుమతులు తగ్గినప్పుడు అటు రొయ్యల రైతులు, ఇటు మత్స్యకారులు నష్టపోతున్నారు. అలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు వారి నష్టాలను నివారించడానికి స్థానికంగా ప్రజలకు తాజా..తాజా మత్స్య సంపదను అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం రిటైల్ యూనిట్లు అందుబాటులోకి తీసుకొస్తోంది.

సబ్సిడీ ఇలా...

ఈ పథకం కింద ప్రభుత్వం రూ.1.75 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. లబ్ధిదారుడు 5 సంవత్సరాల లీజ్ అగ్రిమెంటుతో ఒక రూమును ఎంపిక చేయాలి. యూనిట్ మొత్తంలో 10 శాతం లక్ష్యాన్ని చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 60 శాతం, మిగిలిన లబ్ధిదారులకు 40 శాతం సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోంది. ఈ చేపల దుకాణాన్ని ఏర్పాటు చేసిన తర్వాత మత్స్యశాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ద్వారా లబ్ధిదారునికి 25 శాతం సబ్సిడీ అందజేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష పెట్టుబడితో ఉపాధి పొందవచ్చు. మండల కేంద్రం, చిన్న మున్సిపాలిటీలో అయితే రూ.2 లక్షలు, కార్పొరేషన్లలో అయితే రూ.3 లక్షలతో ప్రారంభించవచ్చు.

జిల్లాలో 86 యూనిట్లు...

జిల్లాలో ఇప్పటి వరకూ రిటైల్ అవుట్ లెట్లు 86 ఏర్పాటయ్యాయి. ఒక్క సింగరాయకొండ మండలంలోనే మూడు దుకాణాలు ఉన్నాయి. తొలుత ప్రభుత్వం ప్రతి మండలానికి దుకాణాల ఏర్పాటుకు లక్ష్యాలు విధించగా ప్రస్తుతం ఎంత మందికైనా యూనిట్లు మంజూరు చేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. దీంతో ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటున్నారు.

మత్స్యకారులకు అండగా...

మత్స్యకార భరోసా, 50 సంవత్సరాలకే మత్స్యకారులకు పింఛన్ వంటి పథకాలతో పాటు సముద్రంలో పట్టుకున్న చేపలు అమ్ముకోవడానికి మోటారు సైకిళ్లు, ఐస్‌బాక్స్‌లు ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోంది. తాజాగా ఫిష్ ఆంధ్ర చేపల దుకాణం పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు సైతం ఆర్థిక భరోసా ఇస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వంలో మత్స్యకారులకు తీరని అన్యాయమే జరిగింది. సబ్సిడీపై వలలు ఇస్తామని చెప్పి నాసిరకం వలలు అంటగట్టేవారు. వేట నిషేధ భత్యం కూడా సక్రమంగా ఇచ్చేవారు కాదు. డీజిల్ సబ్సిడీ కూడా సక్రమంగా అందేది కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గంగపుత్రులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తోంది.



కలికవాయలో ఏర్పాటు చేసిన చేపల దుకాణం



పాకల బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన చేపల దుకాణం

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> 
>
> రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫిష్ ఆంధ్ర పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. ఈ పథకం కింద ప్రభుత్వం యూనిట్ ధరను రూ.1.75 లక్షలుగా నిర్ణయించగా, లబ్ధిదారులు 10 శాతం చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, మిగిలిన వారికి 40 శాతం సబ్సిడీ లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ ప్రతి లబ్ధిదారునికి 25 శాతం అదనంగా సబ్సిడీ ఇస్తోంది.
>
> – ఎస్‌వీఎస్ వర్షిణి, మత్స్యశాఖాధికారి, సింగరాయకొండ

> **జగనన్న మంచి నిర్ణయం తీసుకున్నారు**
>
> 
>
> ఫిష్ ఆంధ్ర చేపల దుకాణం పథకం కింద మా గ్రామంలో నేను యూనిట్ ఏర్పాటు చేశాను. రూ.1.75 లక్షలకుగానూ 10 శాతం మాత్రమే డబ్బు చెల్లించాను. ఈ చేపల దుకాణం ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాను. సీఎం జగనన్న మంచి నిర్ణయం తీసుకుని బతుకుదెరువు చూపించారు.
>
> – ప్రేముల మన్విత, లబ్ధిదారు, కలికవాయ

> **వ్యాపారం బాగుంది**
>
> 
>
> ఫిష్ ఆంధ్ర చేపల దుకాణం పథకం కింద నేను చేపల దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తోంది. వ్యాపారం బాగుంది. నాకు ఆర్థిక భరోసా లభించింది. ఇటువంటి పథకాల వలన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడింది.
>
> – సీహెచ్ భూదేవి, చీమకుర్తి

పరిపూర్ణమైన సేవలే ప్రభుత్వ లక్ష్యం



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్
- గురిజేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: ప్రజలకు పరిపూర్ణమైన సేవలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పెట్టుకుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం మండలంలోని గురిజేపల్లిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను చివరి ఇంటి వరకు చేర్చేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన పేద ప్రజలు లబ్ధిపొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పథకాలు సక్రమంగా అందాయా..లేదా..? అని తెలుసుకోవడానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తక్షణమే పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. జగనన్న పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయని మంత్రి విమర్శించారు. ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి.. ఆ తర్వాత మోసం చేయడమే పనిగా ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు ముందుకు సాగుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయనతో పాటు ఆయన కుమారుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ రాష్ట్రంపై విరుచుకుపడుతున్నారని అన్నారు. 14 సంవత్సరాల పాటు సీఎంగా వెలగబెట్టిన చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని, ఇప్పుడు తానేదో చేస్తానని అనడంలో నిజం లేదని రాష్ట్ర ప్రజలే బాహాటంగా చెబుతున్నారని తెలిపారు. జగనన్న సీఎం బాధ్యతలు చేపట్టిన 4 సంవత్సరాల కాలంలో ఎన్నికల హామీలన్నీ నెరవేర్చారని వివరించారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని తెలిపారు. అమ్మ ఒడి పథకం ద్వారా పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లి అకౌంట్‌లో నేరుగా డబ్బు జమచేస్తున్నారని, దీనివలన పేద కుటుంబాలకు ఊరట కలుగుతోందని మంత్రి అన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి...

సమస్యలు పరిష్కరించే దిశగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆదిమూలపు సురేష్ కోరారు. అన్ని శాఖల అధికారులు పాల్గొని తక్షణమే సమస్యలు పరిష్కరిస్తారన్నారు. రాష్ట్రంలో చక్కటి పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మూడ మంచు బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నాయకులు ఎన్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, షేక్ వలి, బి.బాలచెన్నయ్య, వెన్నా రామిరెడ్డి, బాలయోగిరెడ్డి, సర్పంచ్ పి.జ్యోతి, ఎంపీటీసీ ఆదిలక్ష్మి, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఈవోఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, హౌసింగ్ డీఈ సురేష్‌బాబు, డీటీ విజయభాస్కర్, ఏపీవోలు శైలజ, నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ అల్లూరయ్య, ఎంఈవో పి.ఆంజనేయులు పాల్గొన్నారు.



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత

మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: మహిళల సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలోని బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. మెప్మా సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి అక్కాచెల్లెమ్మలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి మెప్మా అర్బన్ మార్కెట్లను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మెప్మాలోని సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి కుటుంబం అన్ని విధాలుగా స్థిరపడాలన్నారు. లైవ్లీహుడ్ యాక్టివిటీస్‌లో భాగంగా నగరపాలక సంస్థ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో మెప్మా మార్కెట్‌ను ఏర్పాటు చేసినట్లు మేయర్ గంగాడ సుజాత తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాలు ప్రదర్శించిన ఉత్పత్తులను ఎమ్మెల్యే బాలినేని పరిశీలించి మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, డీసీహెచ్ కొండయ్య, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు బేతంశెట్టి శైలజ, తాడి కృష్ణలత, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సత్య వర్సెస్ జనార్దన్

- దామచర్ల సోదరుల మధ్య విభేదాలు మరోసారి బహిర్గతం
- గందరగోళంగా టీడీపీ బస్సు యాత్ర
- ఆగమన్నా ఆగని బస్సు

కొత్తపట్నం: టీడీపీలో దామచర్ల సోదరుల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. టీడీపీ చేపట్టిన బస్సు యాత్ర సందర్భంగా ఇరువర్గాలు నువ్వా..నేనా అంటూ తలపడుతున్నాయి. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ జిల్లాలో బుధవారం నుంచి తెలుగుదేశం పార్టీ చైతన్య రథయాత్ర ప్రారంభించింది. తొలి రోజు జనం నుంచి స్పందన రాకపోడంతో తుస్సుమంది. రెండో రోజు కూడా అంతంత మాత్రంగానే జనం వచ్చారు. ఐదారు జిల్లాల నుంచి వచ్చిన నాయకులు తమ ప్రసంగాలతో హడావిడి చేశారు. ఇదిలా ఉండగా ఈ బస్సు యాత్ర సందర్భంగా దామచర్ల సోదరులు జనార్దన్, సత్య మధ్య వర్గ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. బుధవారం రాత్రి కె.పల్లెపాలెంలో నిర్వహించిన సభలో మేనిఫెస్టోపై రాష్ట్ర నేతలు ప్రసంగించిన తర్వాత స్థానిక నేతలు ప్రసంగించాల్సి ఉంది. ఆ నేతల్లో దామచర్ల సత్యా కూడా ఉన్నారు. సభకు జనం నుంచి స్పందన కరువవడంతో అర్ధంతరంగా ముగించేశారు. అయితే, సత్య ప్రసంగించాల్సి ఉండగా.. కావాలనే మాట్లాడనీయకుండా సభను ముగించేశారని సత్య అనుచరులు జనార్దన్‌పై మండిపడుతున్నారు. గురువారం ఉదయం పల్లెపాలెం నుంచి గవుల్లపాలెం, రాజుపాలెం, వజ్జిరెడ్డిపాలెం, ఈతముక్కల, సంకువారిగుంట గ్రామాలు తిరుగుతూ సూరారెడ్డిపాలెం వరకు చైతన్యయాత్ర సాగింది. ఈతముక్కల గ్రామానికి వచ్చేసరికి దామచర్ల సత్య వర్గానికి చెందిన వడ్లమూడి మాధవరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు బస్టాండ్ సెంటర్‌కు వచ్చారు. అక్కడ మహిళలచే కోలాటం వంటి ప్రదర్శనలు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో నిలపాలని సత్య వర్గం పట్టుబట్టింది. కానీ, అక్కడ నిలపడానికి వీలులేదని జనార్దన్ పట్టుబట్టడంతో బస్సు ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో సత్య వర్గం నాయకులు పార్టీ రాష్ట్రనాయకులపై కూడా మండిపడ్డారు. ఈతముక్కల గ్రామంలో ప్రధాన నాయకులుగా ఉన్న జనార్దన్ అనుచరులు నందకుమార్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, ఇతర నాయకులు కూడా బస్సు యాత్రకు డుమ్మాకొట్టారు. ఈ పరిణామంతో జనార్దన్ కంగుతిన్నారు. వర్గ విభేదాలు తీవ్రతరం కావడంతో రెండో రోజు కూడా బస్సుయాత్ర అసంపూర్తిగా సాగింది.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత

- అత్యాధునిక మందుల పంపిణీ వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ వద్ద మందులు సరఫరా చేసేందుకు అత్యాధునిక సదుపాయాలతో కూడిన కొత్త రిఫ్రిజిరేటర్ వాహనాన్ని జెండా ఊపి గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.35 లక్షల విలువైన వాహనాన్ని జిల్లాకు కేటాయించడం సంతోషకరమన్నారు. పెద్ద వాహనం కావడంతో ఒకేసారి ఎక్కువ కేంద్రాలకు వేగంగా మందులు సరఫరా చేసేందుకు వీలవుతుందన్నారు. ఈ వాహనం ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 1,009 ఆరోగ్య కేంద్రాలకు మందులు సరఫరా చేయవచ్చన్నారు. మైనస్ 23 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా వ్యాక్సిన్‌లు, మందులను స్టోర్ చేసుకుని సరఫరా చేసే సౌకర్యం ఈ వాహనం సొంతమని అన్నారు. అనంతరం సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. డ్రగ్‌స్టోర్‌లో మందులు నిల్వ చేస్తున్న విధానం, ఈ–ఔషధి, రికార్డు రూము నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. డ్రగ్ స్టోర్‌లో ఎంతో విలువైన మందులు ఉంటాయని, వాటికి కావాల్సిన భద్రత, ఫైర్, వెంటిలేషన్, కోల్డ్ స్టోరేజ్ సిస్టమ్‌ను సక్రమంగా పర్యవేక్షిస్తుండాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ ఎం.విజయభాస్కర్, స్టోర్ మేనేజర్ టి.రాజశేఖర్‌రెడ్డి, ప్రోగ్రామింగ్ మేనేజర్ విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.



డ్రగ్ సరఫరా నూతన వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

చికిత్స పొందుతూ బాలుడు మృతి

రాచర్ల: విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు గురువారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..మండలంలోని యడవల్లి పంచాయతీ పరిధిలోని చర్లోపల్లె గ్రామానికి చెందిన ఇరగనబోయిన వెంకట చందు (12) మిద్దెమీద ఆడుకుంటూ ఈ నెల 13న విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతన్ని మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తండ్రి రమణయ్య, తల్లి భూలక్ష్మి గ్రామ వంటీర్‌గా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు వెంకట చందు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వెలగ మహేష్ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 2024–25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, చీరాల, అద్దంకి, వేటపాలెం, పొన్నలూరు, సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కోరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల నుంచి మాత్రమే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాలను 5వ తరగతి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే ధృవీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నియమాలు జాగ్రత్తగా పరిశీలించుకుని అప్‌లోడ్ చేయాలన్నారు. 2021-22లో 3వ తరగతి, 2022–23లో నాలుగో తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. అప్‌లోడ్ చేసుకునేందుకు ఆగస్టు 8వ తేదీ చివరి తేదీ అన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.


ఆటో, బైకు ఢీకొని యువకుడు దుర్మరణం



మృతుడు శ్రీనివాసులు

అద్దంకి: ఆటో బైకును ఢీన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అద్దంకి–దర్శి ఆర్అండ్‌బీ రహదారిలోని అద్దంకి పెరికపాలెం సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన వెంగలశెట్టి అంజయ్య కుమారుడు శ్రీనివాసులు(35) కూలి పనులు చేసుకొని జీవిస్తుంటాడు. ఈ క్రమంలో అద్దంకి వెళ్లి తిరిగి వస్తుండగా పట్టణంలోని పెరికపాలెం వద్ద ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య జ్యోతి, కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భర్త మరణంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపించింది. బంధువులు శోకసముద్రంలో మునిగారు.

అందరికీ జగనన్న విద్యా కానుక



విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రభుత్వ టెక్టు బుక్స్ ప్రెస్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి

చీరాల అర్బన్: విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక అందేలా చూడాలని ప్రభుత్వ టెక్టు బుక్స్ ప్రెస్ డైరెక్టర్ కే.రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. చీరాలలోని ఏపీ మోడల్ స్కూల్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి ప్రతి తరగతి గదిలో విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. నూతనంగా ప్రారంభించిన సీబీఎస్‌ఈ సిలబస్ ప్రకారం మారిన టెక్టు బుక్స్‌లోని అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందాయని తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికల హాస్టల్ సందర్శించి వసతులను పరిశీలించారు. అందరూ సమష్టిగా పనిచేసి పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుధారాణి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జే.సరళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణగండం

- జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట వద్ద ట్రావెల్ బస్సు దగ్ధం
- డ్రైవర్ అప్రమత్తతతో 22 మంది ప్రయాణికులు సురక్షితం
- అగ్నికి ఆహుతైన ల్యాప్‌టాప్‌లు, విలువైన వస్తువులు



అగ్నికీలల్లో ట్రావెల్స్ బస్సు.. కార్బన్‌డయాక్సైడ్ సిలిండర్లను వెనక్కి తీసుకెళ్తున్న పెట్రోల్ బంకు సిబ్బంది

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద గురువారం అర్ధరాత్రి ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. బస్సు వెనకభాగాన మంటలు రావడాన్ని గమనించిన డ్రైవర్ తెలంగు లక్ష్మణ్ వెంటనే అప్రమత్తమై రోడ్డు మార్జిన్‌లో నిలిపేసి బకెట్‌తో నీళ్లు చల్లి ఆర్పే ప్రయత్నం చేశాడు. ఈలోగా బస్సులోని 22 మంది ప్రయాణికులంతా కిందకు దిగారు. మంటలు ఆర్పేందుకు డ్రైవర్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ ప్రమాదంలో బస్సు దిగువ భాగంలో భద్రపరచిన ప్రయాణికుల లగేజీ అగ్నికి ఆహుతైంది. లాప్‌టాప్‌లు, విలువైన వస్తువులు కాలిపోయాయని ప్రయాణికులు వాపోయారు.

ట్రావెల్స్ బస్సు తగలబడుతోందన్న సమాచారం తెలుసుకున్న సీఐ దాచేపల్లి రంగనాథ్, జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వరరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఇతర ప్రైవేట్ బస్సుల్లో గమ్యస్థానాలకు పంపించారు. టంగుటూరు అగ్నిమాపక సిబ్బందిని రప్పించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నికీలలు ఎగిసిపడటంతో ట్రాఫిక్ అరగంటకు పైగా స్తంభించింది. మంటలు అదుపులోకి వచ్చాక పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



ప్రయాణికులకు ధైర్యం చెబుతున్న సీఐ రంగనాథ్

బస్సులో అగ్నిమాపక నిరోధకాలు నిల్

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మంటల్లో కాలిపోతున్నా డ్రైవర్‌తోపాటు ప్రయాణికులు చూస్తూ ఉండిపోవాల్సి వచ్చింది. మంటలను అదుపు చేసే కార్బన్‌డయాక్సైడ్ సిలిండర్లు బస్సులో ఉండి ఉంటే ప్రమాద తీవ్రత ఇంత ఉండేది కాదని, తమ విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యేవికావని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ట్రావెల్స్ బస్సు నిర్వాహకులు కనీస జాగ్రత్తలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఒక్కో ట్రావెల్స్ బస్సులో 11 సీట్లకు ఒక కార్బన్‌డయాక్సైడ్ సిలిండర్, ప్రమాద సమయాల్లో అద్దాలు పగలగొట్టడానికి గొడ్డలి లాంటి ఇనుప వస్తువులు గల టూల్‌కిట్ ఉండాలి. అంటే ఒక్కో బస్సులో 4 సిలిండర్లు తప్పనిసరి. కానీ ఈ బస్సులో ఒక్క సిలిండర్ కూడా లేకపోవడంతో భారీ నష్టం జరిగింది. అదృష్టవశాత్తు ప్రాణాపాయం సంభవించలేదు. పక్కనే ఉన్న పెట్రోల్ బంకు నుంచి కార్బన్‌డయాక్సైడ్ సిలిండర్లు తీసుకొచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అవి కూడా పనిచేయకపోవడం గమనార్హం.

పద్ధతి మారకపోతే కఠిన చర్యలు

- రౌడీషీటర్లకు ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరిక



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరించారు. ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని ఒంగోలు వన్‌టౌన్, టూటౌన్, తాలుకా పోలీస్ స్టేషన్లలో వివిధ కేసుల్లో రౌడీషీటర్లుగా నమోదైన ఉన్న వ్యక్తుల కార్యకలాపాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్ల ప్రస్తుత స్టేటస్, ఇటీవల కాలంలో వారిపై నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లకు ఎక్కడి నుంచి ఆదాయం వస్తోంది, వారి రోజువారీ కార్యకలాపాలేమిటి అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. స్టేషన్ల పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లను గుర్తించామని, వారు నేర ప్రవృత్తి మానుకుని, సత్ప్రవర్తనతో మెలగడం మంచిదని హితవు పలికారు. గత పరిణామాలను మరిచిపోయి మంచి నడవడికతో జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని సూచించారు. వివాదాలకు దూరంగా, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలన్నారు. దౌర్జన్యాలు, నేరాలకు పాల్పడటం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా సహించేది లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, కక్షలు, గొడవలకు దిగడం ద్వారా అశాంతి కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్ల లిస్టు తయారు చేసి వారి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రౌడీల్లో సత్ప్రవర్తన కలిగేలా తరచూ కౌన్సెలింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, తాలుకా సీఐ ఆర్.రాంబాబు, వన్‌టౌన్ సీఐ టి.వెంకటేశ్వర్లు, టూటౌన్ సీఐ ఎస్.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి



మాట్లాడుతున్న శ్రీహర్షిణీ విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్

ఒంగోలు: నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ హానర్స్‌లో సింగిల్ మేజర్ సబ్జెక్టు గురించి గురువారం స్థానిక శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అవగాహన సదస్సులో వివిధ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, డిగ్రీలో చేరనున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశాలు ఈ నెల 24వ తేదీ లోగా ఓఏఎండీసీలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ ఉపయోగాలు, దానిని ఎందుకు ప్రవేశపెట్టారనే దానిపై అవగాహన కల్పించారు. హయ్యర్ ఎడ్యుకేషన్ అకడమిక్ ఆఫీసర్ శ్రీరంగం మాథ్యూస్ మాట్లాడుతూ సింగిల్ సబ్జెక్టు మేజర్‌తో నాలుగేళ్ల డిగ్రీ కార్యక్రమానికి 2022లో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ప్రవేశపెడుతుందని తెలిపారు. సమాజం, పరిశ్రమపై మంచి అవగాహన ఉండాలంటే విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనాలని, ఇంటర్న్‌షిప్‌లకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ రాజమోహన్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ సోమశేఖర్, పరీక్షా విభాగాలకు సంబంధించిన ఆచార్యులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, పద్మజ, ఇతర యూనివర్శిటీ అధ్యాపకేతర సిబ్బంది, శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌కు గురైన వైద్యునిపై పునర్విచారణ



గుంటుపల్లి పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

బల్లికురవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి విజయమ్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గతేడాది సెప్టెంబరు 3న సస్పెండ్‌కు గురైన పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రకాశ్‌రావుపై రీ ఎంక్వయిరీ చేపట్టారు. ఈసందర్భంగా సిబ్బందితో ఆమె మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా గర్భిణులు, చిన్నారులు కిశోర బాలికల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు సబ్‌సెంటర్లలో సమీక్షించి మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. గర్భిణుల వివరాలను ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకాడెమీ లింకులో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఏఎన్‌ఎంలను ఆదేశించారు. వైద్యశాలలో వైద్యులు సిబ్బంది కొరతను తీర్చామని, ఓపీ పెంచాలని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి జి. భానుప్రకాష్‌పై ఫిబ్రవరి 15 మొదటి విచారణ, గురువారం రెండో విచారణతో నివేదికను ఉన్నతాధికారికి నివేదించనున్నట్లు ఆమె తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల రోగాలకు చికిత్సలు అందుతున్నాయని, జిల్లాలో 363 వైఎస్సార్ క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మంచం పట్టిన వృద్ధులు, చిన్నారుల వైద్యం కోసం ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా సేవలు అందించామన్నారు. జిల్లాకు కొత్తగా దోనెపూడి, వి. కొప్పరపాడు, ఏల్చూరు గ్రామాలకు పీహెచ్‌సీలు మంజూరయ్యాయని త్వరలో పూర్తిస్థాయి వైద్యులు సిబ్బందితో ఆయా గ్రామాల్లో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. గుంటుపల్లి పీహెచ్‌సీకి రూ.10 లక్షలతో అదనంగా ఆరు బెడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరయ్యాయని త్వరలో నిర్మాణ పనులు చేపడతామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఒంగోలు అర్బన్: వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా డీఈఐసీ, ఎన్ఆర్‌సీల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీడియాట్రిషన్ (1), సైకాలజిస్ట్ (1), న్యూట్రిషన్ కౌన్సిలర్ (1), డెంటల్ టెక్నీషియన్ (1), ఆడియాలజిస్ట్, స్పీచ్‌థెరపీ (1) నియమించేందుకు ఇంటర్వ్యూల ద్వారా ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు (ఆదివారం మినహా) పనివేళల్లో స్వయంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. అప్లికేషన్ నమూనా, సర్వీస్ సర్టిఫికెట్ నమూనా, నివాస ధ్రువీకరణ నమూనాలను ప్రకాశం.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చని తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- డ్రైవర్‌కు తీవ్ర, ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



కాలు విరగిన బస్సు డ్రైవర్

మద్దిపాడు: ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న లారీని ఢీకొన్న ప్రమాదంలో బస్ డ్రైవర్‌కు కాలు విరగ్గా..ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఏడుగుండ్లపాడు సమీపంలో అర్ధరాత్రి దాటిన తరువాత జాతీయరహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న సిమెంట్‌లోడు లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎడుమ కాలు విరిగిపోగా, ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన జరిగిన విషయం తెలుసుకున్న మద్దిపాడు ఎస్ఐ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ఆర్టీసీ డ్రైవర్‌ను, స్వల్పగాయాల పాలైన ప్రయాణికులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ప్రయాణికులు గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి ట్రక్ ఆటో బోల్తా

- వృద్ధురాలు, ముగ్గురు చిన్నారులకు గాయాలు



తీవ్రంగా గాయపడిన సుగుణమ్మ



స్వల్ప గాయాలపాలైన చిన్నారులు

పొదిలి రూరల్: వేగంగా వెళ్తున్న ట్రక్ ఆటో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన పొదిలి మండలం బట్టువారిపల్లె సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మార్కాపురం నుంచి ట్రక్ ఆటో ఒంగోలుకు బయటుదేరింది. పొదిలి మండలం కొండాయపాలెం పంచాయతీలోని సలకనూతల ఎస్సీ కాలనీకి చెందిన వారు మేకలవారిపల్లెలో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి చేరుకునేందుకు బస్సు కోసం వేచి ఉన్నారు. అదే సమయంలో ట్రక్ ఆటో వస్తుండటంతో అందులో ఎక్కారు. మార్గమధ్యంలో బుట్టువారిపల్లె వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. సలకనూతలకు చెందిన శిరుగూరి సుగుణమ్మకు తీవ్రంగా, చిన్నారులు శిరుగూరి ప్రవీణ్, శిరుగూరి కౌశిక్, శిరుగూరి శశికుమార్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. సుగుణమ్మ, కౌశిక్‌ను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు

ముండ్లమూరు: వరకట్న వేధింపుల కేసులో ముగ్గురు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ దర్శి జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జీవీఎల్ సరస్వతి తీర్పు వెల్లడించినట్లు ఎస్సై ఎల్.సంపత్‌కుమార్ గురువారం రాత్రి తెలిపారు. వివరాలు.. ముండ్లమూరుకు చెందిన పాతూరి రోజా 2014 ఫిబ్రవరిలో తన భర్త, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన పాతూరి వెంకటేశ్వరావుతో రోజాకు వివాహం జరిగింది. ఏడాది గడవక ముందే భర్త వెంకటేశ్వరరావు, అతని కుటుంబ సభ్యులు పాతూరి ప్రసాద్, గోవర్ధన మానసికంగా వేధిస్తూ అదనపు కట్నం కోసం ఇబ్బంది పెట్టారని రోజా ఫిర్యాదులో పేర్కొంది. ఆ కేసులో గురువారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితులు ముగ్గురికి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎస్‌కే జె.అహ్మద్ వాదనలు వినిపించారు. సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి కేసు పురోగతికి కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాసరావు సహకరించినట్లు ఎస్సై తెలిపారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. సర్వేపై డివిజన్ వారీగా మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. వారు కింది స్థాయిలో ఉన్న ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వలంటీర్లకు పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చి సర్వే చేయించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్‌లు, వలంటీర్లు వారి పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి పాఠశాలలకు, కాలేజీలు, హాస్టళ్లకు వెళ్లి సర్వే చేయాలన్నారు. గుర్తించిన అనుమానితుల వివరాలను ఏఎన్ఎం యాప్లో నమోదు చేయాలన్నారు. వారిని వ్యాధి నిర్ధారణ కోసం పీహెచ్‌సీ వైద్యుల వద్దకు తీసుకువెళ్లి పరీక్ష చేయాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు ఇవ్వాలన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి 6 నుంచి 12 మాసాలు పాటు చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. 2027 నాటికి కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించే దిశగా పనిచేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, లెప్రసీ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్, డీఈఓ రమేష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

యజమానికి టోకరా!

- రూ.50 లక్షల నగదుతో గుమస్తా పరార్
- ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త దగ్గర గుమస్తాగా పనిచేస్తున్న వ్యక్తి రెండు రోజుల క్రితం రూ.50 లక్షలు తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై శశికుమార్ తెలిపారు. వివరాలు.. మండలంలోని నికరంపల్లి గ్రామానికి చెందిన వి.అచ్యుతకుమార్‌రెడ్డి గత కొన్నేళ్లుగా పట్టణంలోని ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. నమ్మకంగా ఉండటంతో సదరు పారిశ్రామికవేత్త ఆర్థిక లావాదేవీల బాధ్యత కూడా అప్పగించారు. ఈ క్రమంలో బ్యాంకులో రుణం చెల్లించడం కోసం ఇచ్చిన నగదుతోపాటు అపార్ట్‌మెంట్ యజమానుల వద్దకు వెళ్లి యజమాని పేరు చెప్పి బకాయిలు వసూలు చేసుకుని మొత్తం రూ.50 లక్షల నగదుతో పరారయ్యాడు. రెండు రోజులపాటు స్వగ్రామం, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా గుమస్తా ఆచూకీ లభించలేదు. బాధిత వ్యాపారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్యాషన్







ప్రింట్స్.. స్టయిల్స్

ఫ్లోరల్, మల్టీకలర్ ప్రింట్స్ ఏవైనా మనసుకు ఎప్పుడూ ఆహ్లాదాన్నిస్తాయి. ఫ్యాబ్రిక్ ఏదైనా చూడముచ్చటగా ఉంటాయి. సీజన్‌తో పనిలేకుండా పార్టీ ఏదైనా ఇండోవెస్ట్రన్ లుక్‌తో టాప్ టు బాటమ్ ఎవర్‌గ్రీన్ లుక్‌తో ప్రింటెడ్ ఆకట్టుకుంటున్నాయి. క్యాజువల్ వేర్‌గానూ కలర్‌ఫుల్ అనిపిస్తాయి. అందుకే, డిజైనర్లు ప్రింట్ కాన్సెప్ట్‌ను ఎప్పుడూ వినూత్నంగా మన ముందుకు తీసుకు వస్తుంటారు. వాటిలో కొన్ని డిజైన్స్ ఇవి.

లెహంగా శారీ, లాంగ్ కోట్, ట్రౌజర్, శారీ గౌన్, కుర్తా పైజామా.. మల్టీ కలర్ ప్రింట్లతో టాప్ టు బాటమ్ ఒకే కలర్ కాంబినేషన్‌ను ఎంచుకుంటే ఈ థీమ్‌కు సరిగ్గా నప్పుతుంది. ఈ స్టయిల్‌కి ఇతర యాక్సెసరీస్ కూడా అంతగా అవసరం ఉండదు. ప్రత్యేకంగా కనిపించే ఈ ప్రింటెడ్ డ్రెస్సులు ఎక్కడ ఉన్నా అంతే ప్రత్యేకతను చాటుతాయి.

మన నైటింగేల్


అడవి బిడ్డల ఆత్మీయ నేస్తం... తేజావత్ సుశీల




వృత్తే దైవంగా, సేవే పరమార్థంగా భావించిన తేజావత్ సుశీలకు ఈ యేడాది ప్రతిష్టాత్మక 'ఫ్లారెన్స్ నైటింగేల్' అవార్డు దక్కింది. తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం, ఎర్రగుంట ప్రాథమిక వైద్యశాలలో ఏఎన్ఎంగా సేవలందిస్తున్న సుశీల గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా 27 ఏళ్ల తన కెరీర్ గురించి సుశీల 'సాక్షి'తో పంచుకున్నారు.

''ఉమ్మడి ఖమ్మం జిల్లాలలోని వీ వెంకటాయ పాలెం అనే గ్రామం మా సొంతూరు. 1996లో ఏఎన్ఎంగా తొలి పోస్టింగ్ మణుగూరులో వచ్చింది. ఆ తర్వాత సుజాతనగర్‌లో కొన్నాళ్లు పని చేశాను. 2010 నుంచి ఏజెన్సీ ప్రాంతమైన ఎర్రగుంట పీహెచ్‌సీలో పని చేస్తున్నాను. 27 ఏళ్ల కెరీర్‌లో పనిలోనే సంతృప్తి వెతుక్కుంటూ వస్తున్నాను. మా ఇల్లు, నాకు కేటాయించిన గ్రామాలు తప్ప పెద్దగా బయటకి పోయిందీ లేదు. హైదరాబాద్‌కు కూడా వెళ్లడం తక్కువే. చదువుకునేప్పటి నుంచి ఈ రోజు వరకు... ఏనాటికైనా ఢిల్లీని చూస్తానా అనుకునేదాన్ని. కానీ ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ వరకు నా ప్రయాణం ఉంటుందని అనుకోలేదు. దేశ ప్రథమ మహిళ చేతుల మీదుగా అవార్డు అందుకున్న క్షణాలు మరువలేనివి.

రెండు ప్రాణాలు

2010 సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి గుత్తి కోయలు తెలంగాణకు రావడం ఎక్కువైంది. నా పీహెచ్‌సీ పరిధిలో మద్దుకూరు సమీపంలో గుత్తికోయలు వచ్చి మంగళబోడు పేరుతో ఓ గూడెం ఏర్పాటు చేసుకున్నట్టు అక్కడి సర్పంచ్ చెప్పాడు. ఆ గ్రామానికి తొలిసారి వెళ్లినప్పుడు ఎవ్వరూ పలకరించలేదు. నేనే చొరవ తీసుకుని అన్ని ఇళ్లలోకి తలుపులు తీసుకుని వెళ్లాను. ఓ ఇంట్లో ఓ మహిళ అచేతనంగా పడుకుని ఉంది. పదిహేను రోజుల కిందటే ప్రసవం జరిగిందని చెప్పారు. తీవ్ర రక్తస్రావం కావడంతో మనిషి నీరసించిపోయి ఉంది. ఒళ్లంతా ఉబ్బిపోయి ఉంది. వెంటనే ఆ గ్రామ సర్పంచ్‌ను బతిమాలి ఓ సైకిల్ ఏర్పాటు చేసి అడవి నుంచి మద్దుకూరు వరకు తీసుకొచ్చాను. అక్కడి నుంచి ఆటోలో కొత్తగూడెం ఆస్పత్రికి వచ్చాం. పరిస్థితి విషమించడంతో వరంగల్ తీసుకెళ్లాలని సూచించారు. 108లో ఆమెను వెంటబెట్టుకుని వరంగల్‌కు తీసుకెళ్లాను. 21 రోజుల పాటు చికిత్స అందించిన తర్వాత ఆ తల్లిబిడ్డలు ఇద్దరూ ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారు. ఈ ఘటన తర్వాత అక్కడున్న వలస గుత్తి కోయలకు నాపై నమ్మకం కలిగింది. ఏదైనా సమస్య ఉంటే సంకోచం లేకుండా చెప్పుకోవడం మొదలు పెట్టారు.

రక్తం కోసం బతిమాలాను

ఓసారి గుత్తికోయగూడెం వెళ్లినప్పుడు పిల్లలందరూ నా దగ్గరకు వచ్చారు కానీ జెమిలీ అనే ఏడేళ్ల బాలిక రాలేదు. ఏమైందా అని ఆరా తీస్తూ ఆ పాప ఇంట్లోకి వెళ్లాను. నేలపై స్పృహ లేని స్థితిలో ఆ పాప పడుకుని ఉంది. బ్లడ్ శాంపిల్ తీసుకుని టెస్ట్ చేస్తే మలేరియా పాజిటివ్‌గా తేలింది. వెంటనే పీహెచ్‌సీకి అక్కడి నుంచి కొత్తగూడెం తీసుకువస్తే పాప పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందని డాక్టర్లు చెప్పారు. ఖమ్మం తీసుకెళ్లమన్నారు. అక్కడకు వెళ్తే వరంగల్ పొమ్మన్నారు. కానీ డాక్టర్లను బతిమాలి అక్కడే వైద్యం చేయమన్నాను. ఆ పాపది ఓ నెగెటివ్ గ్రూప్ రక్తం కావడంతో చాలా మందికి ఫోన్లు చేసి బతిమాలి రెండు యూనిట్ల రక్తం సంపాదించగలిగాను. చివరకు ఆ పాప ప్రాణాలు దక్కాయి. మరోసారి ఓ గ్రామంలో ఓ బాలింత చంటిపిల్లకు ఒకవైపు రొమ్ము పాలే పట్టిస్తూ రెండో రొమ్ముకు పాలిచ్చేందుకు తంటాలు పడుతున్నట్టు గమనించాను. వెంటనే ఇన్‌ఫెక్షన్ గుర్తించి ఆస్పత్రికి తరలించాను.

అర్థం చేసుకోవాలి

మైదాన ప్రాంత ప్రజలకు ఒకటికి రెండు సార్లు చెబితే అర్థం చేసుకుంటారు. వారికి రవాణా సదుపాయం కూడా బాగుంటుంది. కానీ వలస ఆదివాసీల గుత్తికోయల గూడేల్లో పరిస్థితి అలా ఉండదు. ముందుగా వారిలో కలిసిపోవాలి. ఆ తర్వాత అక్కడి మహిళలను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే భర్త/తండ్రి తోడు రావాలి. వాళ్లు పనులకు వెళితే సాయంత్రం కానీ రారు. వచ్చే వరకు ఎదురు చూడాలి. వచ్చినా పనులు వదిలి ఆస్పత్రికి వచ్చేందుకు సుముఖంగా ఉండరు. ఆస్పత్రి కోసం పని వదులుకుంటే ఇంట్లో తిండికి కష్టం. అన్నింటికీ ఒప్పుకున్నా.... ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే అడవుల్లో ఉండే గుత్తికోయ గ్రామాలకు రవాణా కష్టం. క్షేత్రస్థాయిలో ఉండే ఈ సమస్యలను అర్థం చేసుకుంటే అత్యుత్తమంగా వైద్య సేవలు అందించే వీలుంటుంది.

కోవిడ్ సమయంలో

మద్దుకూరు, దామరచర్ల, సీతాయిగూడెం గ్రామాలు నా పరిధిలో ఉండేవి. కోవిడ్ సెకండ్ వేవ్ సమయంలో ఈ మూడు గ్రామాల్లో కలిపి ఒకేసారి 120 మందిని ఐసోలేషన్‌లో ఉంచాను. ఇదే సమయంలో మా ఇంట్లో నలుగురికి కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని గ్రామాలు తిరుగుతూ ప్రాణనష్టం రాకుండా సేవలు అందించాను. నా పరిధిలో ఉన్న గ్రామాల్లో ఏ ఒక్కరూ కోవిడ్‌తో ఇంట్లో చనిపోలేదు.

వారి సహకారం వల్లే

వృత్తిలో మనం చూపించే నిబద్ధతను బట్టి మన కంటూ ఓ గుర్తింపు వస్తుంది. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపుడు అర్ధరాత్రి ఫోన్ చేసినా డాక్టర్లు లిఫ్ట్ చేసి అప్పటికప్పుడు సలహాలు ఇస్తారు. అవసరాన్ని బట్టి హాస్పిటల్‌కు వచ్చి కేస్ అటెండ్ చేస్తారు. అదే విధంగా నాతో పాటు పని చేసే ఇతర సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారు. ఇక ఆశా వర్కర్లు అయితే నా వెన్నంటే ఉంటారు. ఏదైనా పని చెబితే కొంత ఆలస్యమైనా ఆ పని పూర్తి చేస్తారు. వీరందరి సహకారం వల్లే నేను ఉత్తమ స్థాయిలో సేవలు అందించగలిగాను. ఈ రోజు నాకు దక్కిన గుర్తింపుకు డాక్టర్ల నుంచి ఆశావర్కర్ల వరకు అందరి సహకారం ఉంది'' అని వివరించారు సుశీల.


సుశీల

– తాండ్ర కృష్ణగోవింద్, సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం

న్యూస్‌మేకర్

వయసు 18 వృత్తి పైలెట్


సాక్షి కొచ్చర్

సాక్షి కొచ్చర్‌కు ఇప్పటి దాకా స్కూటర్ నడపడం రాదు. కారు నడపడం రాదు. కాని ఏకంగా విమానం నడపడం నేర్చుకుంది. ప్రస్తుతానికి యంగెస్ట్ కమర్షియల్ పైలెట్ రికార్డ్ సాక్షి పేరున ఉంది. సంకల్పించాను... సాధించాను అంటోంది సాక్షి.

మన దేశంలో అత్యంత చిన్న వయసులో కమర్షియల్ పైలెట్ లైసెన్స్ సాధించిన రికార్డు మైత్రి పటేల్ పేరున ఉంది. ఆమె 19 ఏళ్ల లైసెన్స్ పొందింది. ఇప్పుడు 18 ఏళ్లకే సాక్షి కొచ్చర్ ఈ లైసెన్స్ పొంది మైత్రి రికార్డును బద్దలు కొట్టింది. సరిగ్గా ఆమె 18వ పుట్టిన రోజున ఈ లైసెన్స్ పొందడం విశేషం.

పదేళ్ల వయసు నుంచే

సాక్షి కొచ్చర్‌ది హిమాచల్ ప్రదేశ్‌కు ముఖద్వారం వంటిదైన పర్వాను టౌన్. అక్కడ తండ్రి లోకేష్ కుమార్ కొచ్చర్‌కు ఫుట్ వేర్ వ్యాపారం ఉంది. పదేళ్ల వయసు నుంచి కుమార్తె పైలెట్ కావాలని కోరుకుంటూ ఉంటే అతడు ప్రోత్సహిస్తూ వచ్చాడు. 'పదో క్లాసు పరీక్షలు అయ్యాక నేను పైలెట్ కావాలని మళ్లీ ఒకసారి గట్టిగా చెప్పాను. అయితే నాకు కామర్స్ లైన్‌లో చదవాలని ఉండేది. లెక్కలు పెద్దగా ఇష్టం లేదు. కాని పైలెట్ కావాలంటే ఎంపీసీ చదవాలని తెలిసి ఇంటర్‌లో ఎంపీసీ తీసుకున్నాను' అని చెప్పింది సాక్షి. ఇంటర్ అయిన వెంటనే ముంబైలోని స్కైలైన్ ఏవియేషన్ క్లబ్‌లో పీపీఎల్ (ప్రైవేట్ పైలెట్ లైసెన్స్)కు కావలసిన థియరీ క్లాసులను నాలుగున్నర నెలల పాటు చదివింది సాక్షి. ఈ క్లబ్‌లోనే కెప్టెన్ ఏ.డి.మానెక్ దగ్గర ఏవియేషన్ పాఠాలు నేర్చుకుంది మైత్రి పటేల్. సాక్షి కూడా కెప్టెన్ మానెక్ దగ్గరే తొలి పాఠాలు నేర్చుకుంది. ఆ తర్వాత సీపీఎల్ (కమర్షియల్ పైలెట్ లైసెన్స్) కోసం అమెరికా వెళ్లింది.

70 లక్షల ఖర్చు

అమెరికాలో కమర్షియల్ పైలెట్ లైసెన్స్ పొందాలంటే దాదాపు 70 లక్షలు ఖర్చు అవుతుంది. అయినా సరే సాక్షి కుటుంబం ఆ ఖర్చును భరించి సాక్షిని అమెరికా పంపింది. అక్కడ మూడు నెలల పాటు సాక్షి ట్రైనింగ్‌లో పాల్గొంది. 'ఇన్‌స్ట్రక్టర్ సహాయంతో విమానం నడపడంలో ఒక రకమైన థ్రిల్ ఉంది. కాని ట్రైనింగ్‌లో భాగంగా మొదటిసారి సోలో ఫ్లయిట్ (ఇన్‌స్ట్రక్టర్ లేకుండా) ఒక్కదాన్నే విమానం నడిపినప్పుడు కలిగిన థ్రిల్, ఆ ఫీలింగ్ మాటల్లో చెప్పలేను. ఆ క్షణం నా జీవితంలో అలాగే ఉండి పోతుంది' అని చెప్పింది సాక్షి. 'అయితే పైలెట్ కావడం అనుకున్నంత సులభం కాదు. ఎన్నో సవాళ్లు, సమస్యలు ఉంటాయి. నా ట్రయినింగ్‌లో ఒకసారి ఎలక్ట్రికల్ సిస్టమ్ ఫెయిల్ అయింది. మరోసారి రేడియో ఫెయిల్ అయింది. నేను కంగారు పడకుండా అలాంటి సమయంలో ఏం చేయాలో అది చేసి సేఫ్ లాండింగ్ చేశాను' అని తెలిపింది సాక్షి.

పైలెట్‌గా ఉద్యోగం

'మా ఊళ్లో నేను పైలెట్ అవుతానని అంటే మా బంధువులు చాలామంది ఎయిర్ హోస్టెస్ అనుకున్నారు. అమ్మాయిలు పైలెట్‌లు కావచ్చునని వారికి తెలియదు. ఇవాళ మన దేశంలో ఎక్కువమంది మహిళా పైలెట్‌లు ఉన్నారు. ఇది చాలా మంచి విషయం. నాకు పైలెట్‌గా ఉద్యోగం రాగానే నా కోర్సు కోసం అయిన ఖర్చు మొత్తం అణాపైసలతో సహా మా అమ్మానాన్నలకు చెల్లిస్తాను' అంది సాక్షి.

ఇంత చిన్న వయసులో లైసెన్స్ పొందిన సాక్షికి ఉద్యోగం రావడం ఎంత సేపనీ.

వంటిల్లు

చేదా..లేదే!

ఎంతమంచి వంటకం అయినా నోటికి రుచిగా లేకపోతే అస్సలు తినబుద్ధికాదు. ఇక చేదుగా ఉండే కాకర కాయ డిష్ అంటే.. "అమ్మో కాకరకాయ" అంటూ ముఖం మాడ్చేస్తారు. అనేక పోషకాలున్న కాకరకాయను మళ్లీమళ్లీ తినాలనిపించేలా ఎలా వండాలో చెబుతోంది ఈ వారం మన వంటిల్లు...



కాకరకాయ పకోడా

కావలసినవి: కాకరకాయలు – రెండు; శనగపిండి – అరకప్పు ; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు ; కారం – టీస్పూను ; ఇంగువ – చిటికెడు ; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – రెండు కప్పులు.

తయారీ: ● కాకర కాయలను శుభ్రంగా కడిగి గుండ్రని/పొడవు ముక్కలుగా తరుక్కోవాలి. ● ముక్కల్లోని విత్తనాలను వేరుచేసి వెడల్పాటి ప్లేటులో వేయాలి. ● శనగపిండి, బియ్యప్పిండి, కారం, ఇంగువ రుచికి సరిపడా ఉప్పును ముక్కలపై చల్లాలి. ● ఇప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ పకోడీ పిండిలా గట్టిగా కలుపుకోవాలి. ● నూనె బాగా మరిగాక కలిపి పెట్టుకున్న ముక్కలను వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి తీసేయాలి.

బేక్డ్ కరేలా



కావలసినవి: కాకరకాయలు – అర కేజీ ; జీలకర్ర పొడి – అరటీస్పూను ; ధనియాల పొడి – ముప్పావు టీస్పూను ; ఆమ్‌చూర్ పొడి – ముప్పావు టీస్పూను ; కారం – టీస్పూను ; పసుపు – టీస్పూను ; బెల్లం పొడి – రెండు టేబుల్ స్పూన్లు ; నూనె ఒకటిన్నర టేబుల్ స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా ; కొత్తిమీర తరుగు – గార్నిష్‌కు సరిపడా; నిమ్మరసం – టీస్పూను.

తయారీ: ● కాకరకాయలను శుభ్రంగా కడిగి పలుచగా తొక్క తీసి గుండ్రని ముక్కలుగా తరగాలి. ● తరిగిన ముక్కలపై నూనెవేసి కలపాలి. ● ముక్కలన్నింటికి నూనె పట్టిన తరువాత జీలకర్ర, ధనియలపొడి, ఆమ్‌చూర్ పొడి, పసుపు, కారం, రుచికి సరిపడా ఉప్పు, బెల్లం పొడి వేసి ముక్కలకు పట్టించి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ● ఇరవైనిమిషాల తరువాత బేకింగ్ ట్రేలో అల్యూమినియం ఫాయిల్ వేసి కొద్దిగా నూనె చల్లి, కాకరకాయ ముక్కలను పలుచగా పోయాలి. ● ఈ ట్రేని అవెన్‌లో పెట్టి 25 నిమిషాలు బేక్ చేసి తీసేయాలి. ● వేడివేడి ముక్కలపై నిమ్మరసం చల్లి, కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి. అన్నం, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.

బిట్టర్ ఆమ్లెట్



కావలసినవి: కాకరకాయ – మీడియం సైజుది ఒకటి ; గుడ్లు – మూడు ; ఉప్పు – రెండు టీస్పూన్లు ; గరం మసాలా – అరటీస్పూను ; నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు.

తయారీ: ● కాకర కాయను శుభ్రంగా కడిగి, విత్తనాలు తీసేసి సన్నగా తరగాలి. ● మరుగుతోన్న నీళ్లలో కొద్దిగా నూనె, టీస్పూను సాల్ట్ , కాకరకాయ ముక్కలు వేసి ఐదు నిమిషాలు ఉడికించాలి. ● ఉడికిన ముక్కలను నీటినుంచి వేరు చేసి, తడిలేకుండా తుడిచి పక్కన పెట్టుకోవాలి. ● గిన్నెలో గుడ్లసొనను వేసి చక్కగా కలపాలి. ఈ సొనలో రుచికి సరిపడా ఉప్పు, గరం మసాలా, కాకరకాయ ముక్కలు వేసి కలపాలి. ● పెనం మీద నూనెవేసి, వేడెక్కిన తరువాత గుడ్ల మిశ్రమం వేసి రెండు వైపులా చక్కగా కాల్చితే బిట్టర్ ఆమ్లెట్ రెడీ.

కాకరకాయ పచ్చడి



కావలసినవి: కాకరకాయలు – పెద్దవి రెండు ; పచ్చిమిర్చి – పన్నెండు ; చిన్న ఉల్లిపాయలు – పదిహేను ; అల్లం – అంగుళం ముక్క ; పచ్చికొబ్బరి తురుము – అరకప్పు ; గడ్డ పెరుగు – రెండు కప్పులు , ఆవాలు – అరటీస్పూను, మెంతులు – పావు టీస్పూను ; ఎండు మిర్చి – రెండు ; కరివేపాకు – ఐదు రెమ్మలు ; నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, కారం – చిటికెడు.

తయారీ: ● కాకరకాయలను నీటిలో నానబెట్టి శుభ్రంగా కడిగి విత్తనాలు తీసేయాలి. ఇప్పుడు కాకరకాయలను చిన్నచిన్న ముక్కలుగా తరుక్కోవాలి. ● అల్లం తొక్కతీసి సన్నగా తరగాలి. 10 పచ్చిమిర్చి, 12 ఉల్లిపాయలను కూడా సన్నని ముక్కలుగా కట్ చేయాలి. ● కాకరకాయ, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలను ఒక గిన్నెలో వేయాలి. దీనిలో కరివేపాకు, కొద్దిగా ఉప్పు, టీస్పూను నూనెవేసి చక్కగా కలుపుకోవాలి. ● ఈ మిశ్రమం మొత్తాన్ని బాణలిలో వేసి రెండు నిమిషాలు పెద్దమంట మీద వేయించాలి. తరువాత మూతపెట్టి సన్న మంట మీద పది నిమిషాలు మగ్గనివ్వాలి. ● మధ్యలో కలుపుతూ... అడుగంటితే మరో టీస్పూను నూనె వేయాలి. ● కొబ్బరి తురుముకు మూడు ఉల్లిపాయలు, రెండు పచ్చిమిరపకాయలు, రెండు టేబుల్ స్పూన్ల నీళ్లు జోడించి పేస్టు చేయాలి. ● బాణలిలో మగ్గుతున్న మిశ్రమంలో ఈ పేస్టు వేసి, కలిపి ఐదు నిమిషాల తరువాత దించేయాలి. ● పెరుగుని సమంగా కలుపుకుని మగ్గిన మిశ్రమంలో వేయాలి. రుచికి సరిపడా ఉప్పు కలిపి తిప్పాలి. ● మిగిలిన నూనెతో ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి. కరివేపాకుతో తాలింపు వేసి కలుపుకోవాలి. చివరిగా కారం చల్లుకుని సర్వ్‌చేసుకోవాలి.